క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలో విశేష సేవలు అందిస్తున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ 2024 సంవత్సరం క్యాలెండర్‌ను గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యులు విజయకుమార్ రెడ్డి, ప్రియాంక చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. పీహెచ్‌సీ సిబ్బందికి క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ విజయకుమార్ మాట్లాడుతూ.. 2020లో ప్రారంభమైన సొసైటీ ప్రజల సహకారంతో విద్య, వైద్యం సేవలు అందించామన్నారు. రక్తదాన శిబిరాల ఏర్పాటు, కష్టాల్లో ఉన్నవారికి ఆర్థిక సాయం చేశామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమల, కె.లింగరాజు, మిన్నారావు, క్రిష్ణ, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదర్శనీయం సావిత్రి బాయిపూలే

టెక్కలి: మహిళా ఉపాధ్యాయినులకు ఆదర్శం సావిత్రిబాయి పూలే అని వక్తలు కొనియాడారు. సావిత్రిబాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయినులను సత్కరించారు. కార్యక్రమంలో ఎల్.బాబూరావు, కె.దాలయ్య, ఎస్.ప్రభావతి, గణపతిరావు, వైకుంఠరావు, పి.ధర్మారావు, ఆర్.రమేష్, జగదీశ్వరరావు, ఎస్.కృష్ణారావు, ఎల్.నరేష్ ఉన్నారు.

8న మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలు

టెక్కలి: ఏపీ నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 8న ఎంసెట్, జేఈఈ మెయిన్స్, నీట్ మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు టి.సూర్యం తెలిపారు. ఈ మేరకు శనివారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, అధ్యాపకులు చేతుల మీదుగా మోడల్ పేపర్లను ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులంతా ఈ మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీధర్, మల్లేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

టెక్కలి: బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ సి.వి.రాజా, డైరెక్టర్లు ఎల్.జె.కృష్ణ, ఆర్.రమేష్‌కుమార్ చేతుల మీదుగా సంక్రాంతి కానుకగా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.ధర్మారావు, బి.విద్యావతి, బి.లత, బి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, ఆర్.వీరాస్వామి, ఆర్.ఢిల్లేశ్వరి ఉన్నారు.

'మానమ్మకం నువ్వే జగన్' హోర్డింగ్ ధ్వంసం

ఇచ్ఛాపురం: 'మానమ్మకం నువ్వే జగన్' హోర్డింగ్‌లను వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు ఇటీవల పట్టణంలో ఏర్పాటు చేశారు. అయితే ఒకటో వార్డు కూడలిలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఒకటో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి సాయం

కవిటి: కవిటిలోని జగన్నాథస్వామి ఆలయ నిర్మాణానికి విశ్రాంత డీఎస్పీ, విజయవాడ హైకోర్టు న్యాయవాది శమళ్ల వెంకటవరప్రసాదరావు తన వంతుగా పదివేల రూపాయలను విరాళంగా సమకూర్చారు. ఈ మొత్తాన్ని నిర్మాణ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు.

బహుమతులు అందజేత

టెక్కలి రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ప్రతిష్టాత్మక ఉత్సవాల్లో భాగంగా టెక్కలిలో డివిజన్ స్థాయిలో వివిధ రకాల వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. వీటిలో గెలుపొందిన విద్యార్థులకు డిప్యూటీ ఈవో జి.పగడాలమ్మ బహుమతులను శనివారం అందజేశారు. ఎంఈవోలు డి.తులసీరావు, డి.చిన్నరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం సిబిజడ్ ఆర్గానిక్ ఫార్మింగ్ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాఢీ, అధ్యాపకులు బృందావన్, పి.రామకృష్ణ, స్నేహలత, నిత్యానందపట్నాయక్, నాక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికులకు సరుకులు పంపిణీ

సోంపేట: పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సంక్రాంతి సందర్భంగా నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు శనివారం పంపిణీ చేశారు. పంచాయతీ ఈవో వరప్రసాద్, సర్పంచ్ నరిగి ప్రభావతి, ఉప సర్పంచ్ హేమసుందరరావు, వార్డు మెంబర్లు మల్లా వెంకటరమణ, దొండపాటి శ్రీను, తోట ఢిల్లీ, తంగుడు వెంకటేష్, కొంచాడ నెహ్రూ పాల్గొన్నారు.

నాడు



నేడు



ఆవేదన తీరింది

తళతళ మెరుస్తున్న పల్లె రోడ్లు

నాడు గుంతల మయం.. నేడు గుంతలు మాయం

ప్రగతి పర్వం

దేశానికి పల్లెలు పట్టుకొమ్మలంటారు. అలాంటి పల్లెల ప్రగతి గత పాలకులకు పట్టలేదు. కనీసం గ్రామీణ రోడ్లను కూడా పట్టించుకోలేదు. అధ్వానంగా మారిన రోడ్లతో ప్రజలు అవస్థలు పడేవారు. చిన్న చినుకుపడినా గుంతల్లో నీరుచేరి ప్రయాణానికి వీలులేకుండా ఉండేవి. వాహన, పాదచారులు నరకాన్ని చూసేవారు. సమస్యను పరిష్కరించాలని ప్రజలు అప్పటి నాయకులను వేడుకున్నా కనీసం స్పందించిన దాఖలాలు లేవు. కేవలం దాచుకో..దోచుకో చందంగా వ్యవహరించేవారు. అలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో పల్లె రోడ్లకు మోక్షం కలిగింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. వజ్రపుకొత్తూరు మండలంలోనే కోట్లాది రూపాయలతో రోడ్లను నిర్మించి ప్రజల ఆ'వే'దనను తీర్చారు. ఇప్పుడు పల్లె రహదారులు ప్రగతిబాటలో పయనిస్తున్నాయి. రోడ్ల విస్తరణ, మరమ్మతులు పూర్తికావడంతో తళతళ మెరుస్తూ దర్శనమిస్తున్నాయి.

–వజ్రపుకొత్తూరు రూరల్

రూపు మారిన రోడ్లలో కొన్నింటి వివరాలు ఇలా..

రోడు	కిలో మీటర్లు	వ్యయం (రూపాయల్లో)	పూర్తయిన శాతం
నగరంపల్లి - శారదాపురం	2.50	98 లక్షలు	పూర్తి
చినబాడాం- అంతరకుద్ద	2.30	70 లక్షలు	పూర్తి
బాలకృష్ణపురం- బుడ్డేపుపేట	3.22	74లక్షలు	పూర్తి
ఈదురపురం- బాలరాంపురం	1.32	35లక్షలు	పూర్తి
ఇచ్ఛాపురం- కొలిగాం	10	1.50 కోటు	పూర్తి

రోడ్డు మారింది



నాపేరు బత్తిని పార్వతీశం. వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం స్వగ్రామం. అక్కుపల్లి మీదగా వజ్రపుకొత్తూరు–కాశీబుగ్గ రోడ్డు అత్యంత ప్రధానమైనది. అక్కుపల్లి శివసాగర్ తీరానికి, వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఈ రోడ్డుపైనే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఈ రోడ్డు రూపురేఖలు మారిపోయాయి. రూ. 18 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో సమస్య పరిష్కారమైంది.

కల నెరవేరింది



గుల్లలపాడు గ్రామానికి చెందిన నా పేరు బమ్మిడి రుక్మంగాధరరావు. మాగ్రామ రోడ్డు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. గుంతలు గుంతలుగా ఉన్న కంకర రోడ్డుపై సాహసంతో ప్రయాణం చేయాల్సి వచ్చేది. గత టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్డును కనీసం పట్టించుకోలేదు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి సీదిరి అప్పలరాజు దయ వల్ల నగరంపల్లి రోడ్డు నుంచి మా ఊరు మీదగా శారదాపురం వరకు సుమారు రూ.98 లక్షలతో రోడ్డు నిర్మాణం జరగడంతో కష్టాలు తప్పాయి. మా గ్రామ ప్రజల ఏళ్ల నాటి కల నెరవేరింది





వాసుదేవునికి ప్రత్యేక పూజలు



రాజ్యలక్ష్మిదేవికి ప్రత్యేక అలంకరణ

మందస: మందసలోని వాసుదేవపెరుమాళ్ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ధనుర్మాసం సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి, రంగనాథులను అలంకరించారు. రాజ్యలక్ష్మిదేవికి ప్రత్యేక అలంకరణ చేశారు. వాసుదేవుని వద్ద ధనుర్మాస ప్రయుక్త తిరుప్పావై-21వ పాసురం విన్నవించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీలోని 1, 2 వార్డులకు చెందిన మహిళా సంఘం సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మెప్మా సీఎంఎం జానకీరామారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావుపట్నాయక్, నాయకులు చాట్ల తిరుపతి, ఆర్‌పీలు పాల్గొన్నారు.

జోరుగా పైపులైన్ పనులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 19వ వార్డు సూదికొండలో కౌన్సిలర్ శిష్టు బృందావతి, పట్టణ అధికారి ప్రతినిధి శిష్టు గోపి సూచన మేరకు మెయిన్ పైప్ లైన్ పనులు చేపట్టగా దగ్గరుండి పర్యవేక్షించారు.

పెరటి కోళ్ల పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: సబ్సిడీపై స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న పెరటి కోళ్లతో మహిళలు ఆర్థికంగా బలోపేతమవుతారని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనం వద్ద 11 డ్వాక్రా మహిళా సంఘాలకు పెరటి కోళ్లను శనివారం పంపిణీ చేశారు. 30 యూనిట్లకు 330 కోళ్లు, దాణా, మందులు అందజేశారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, వీఆర్వో ఉప్పాడ రాజారెడ్డి, ఏపీఎం ప్రసాదరావు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రానికి ఆర్థిక సాయం

కంచిలి: మండపల్లిలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం ప్రాంగణంలో దివ్యాంగ చిన్నారుల పునరావాస కేంద్రం భవనం నిర్మాణానికి పలువురు చిన్నారులు శనివారం ఆర్థిక సాయం అందించారు. కవిటి మండలం మాణిక్యపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రూ. పది వేలు, ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రూ. 13,700 ఫౌండేషన్ నిర్వాహకులకు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

అవ్వాతాతల కళ్లల్లో ఆనందం

అవ్వాతాతల కళ్లలో ఆనందాన్ని చూడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. పెంచిన, కొత్త పింఛన్లను పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం నియోకవర్గాల్లోని పలు గ్రామాల్లో శనివారం ఉత్సాహంగా పంపిణీ చేశారు. వీటిని అందుకున్న లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేసి అభిమానాన్ని చాటుకున్నారు.



కాశీబుగ్గ: న్యూకాలనీ సచివాలయం వద్ద ఫింఛన్ల పంపిణీలో మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణారావు, కౌన్సిలర్ ప్రసాదరావు, కమిషనర్ నాగేంద్రకుమార్



సంతబొమ్మాళిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి



నందిగాం బీసీ కాలనీలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి, జేసీఎస్ ఇన్‌చార్జ్ జయరాం



కవిటి: మాణిక్యపురంలో కొత్తపింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



సోంపేట: పాలవలసలో డయాలసిస్ రోగికి పింఛను అందజేస్తున్న నాయకులు

రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

- మండల సమావేశంలో సభ్యులు డిమాండ్

పలాస: రైస్ మిల్లర్లుపై తగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సాధారణ సమావేశం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన జరిగింది. పలువురు సభ్యులు మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లు తప్పుడు తూనికలతో దోచుకుంటున్నారని ఆరోపించారు. తేమ శాతం పేరుతో ఐదు కేజీల వరకు అదనంగా ధాన్యాన్ని తీసుకుంటున్నారన్నారు. పెదంచల సర్పంచ్ వరిశ రామారావు మాట్లాడుతూ.. ఈ ఏడాది పంటలు పండక, సకాలంలో వర్షాలు లేకపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఎందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మండల సమావేశానికి గృహనిర్మాణ శాఖ ఏఈ ఎందుకు రావడం లేదని బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్ ప్రశ్నించారు. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి, జీడి తదితర ఉద్యానవన పంటలు ఉన్నాయని, ఈ ప్రాంతానికి ఒక నర్సరీ కావాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులను కోరారు. తహసీల్దార్ మధుసూదనరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం భూముల రీసర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. చాలా గ్రామాల్లో చిన్న సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నామని చెప్పారు. వార్షిక బడ్జెట్‌ను ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించి తీర్మానం చేశారు. ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మచ్చ రత్నాలు పాల్గొన్నారు.

టెక్కలిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'



అయ్యప్పనగర్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న హైందవి, నవీనా తదితరులు

టెక్కలి: టెక్కలి గ్రామ సచివాలయం-5 పరిధిలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ...లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుంటూ వైఎస్సార్‌సీపీ యువ నాయకులు డాక్టర్ దువ్వాడ హైందవి, నవీనా తదితరులు కార్యక్రమాన్ని కొనసాగించారు. భవానీనగర్, అయ్యప్పనగర్‌లో పలు వీధుల్లోని ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వార్డు సభ్యుడు టి.లోకేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వి.శ్రీధర్‌రెడ్డి, నాయకులు ఎ.రాహుల్, డి.కుశుడు, టి.జగ్గారావు ఉన్నారు.

తక్షణ సాయం అందజేత

కంచిలి: బొగాబెణి సచివాలయం పరిధి ఎస్.బొనమాళి గ్రామానికి చెందిన నల్లాన హేమలత ఇటీవల మృతిచెందారు. ఈమె వైఎస్సార్‌బీమా పాలసీదారు. దీంతో తక్షణ సాయంగా పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని నామినీగా ఉన్న హరిక్రిష్ణకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. అలాగే జెన్నాగాయి గ్రామానికి చెందిన పండి కృష్ణారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా..అతని కుటుంబాన్ని కూడా ఎంపీపీ పరామర్శించారు. స్థానిక సర్పంచ్ గణప సింహాచలం, బుడ్డెపు సూర్యనారాయణ, కొల్లి తాతాజీ, పండి మోహన్‌రావు ఉన్నారు.

డిజిటల్ బోధన పరికరాలు ప్రారంభం

వజ్రపుకొత్తూరు, వజ్రపుకొత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో విద్య వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు జరిగాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావుదొర అన్నారు. బెండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం డిజిటల్ బోధన పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సమకూరాయన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినాన శాంతారావు, హెచ్‌ఎం విజయ్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



కవిటి: సంబరాల్లో చిన్నారులు



కాశీబుగ్గ: ముగ్గులు పోటీల్లో చిన్నారులు

కవిటి: పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. మడియారపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాల్ని హెచ్‌ఎం జ్యోతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. బాలికలకు రంగవల్లికల పోటీలు నిర్వహించారు. భోగి మంట వేసి దాని విశిష్టతను వివరించారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో కూడా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు సందడి చేశారు. ముగ్గులు పోటీలు నిర్వహించారు.

సంక్షిప్తంగా...

క్రీడాకారులకు టీషర్టులు అందజేత



సంతబొమ్మాళి: టీషర్టులను అందజేస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: బొప్పాయిపురం గ్రామ సచివాలయం వద్ద 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాకారులకు శనివారం టీషర్టులు పంపిణీ చేశారు. సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి, వీఆర్వో వైకుంఠరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: సంతబొమ్మాళిలో క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకరవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి టీషర్టులను పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి ఉన్నారు.

సోంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను ఎంపీపీ నిమ్మన దాస్ పంపిణీ చేశారు. ఎంపీడీవో బి.వెంకటరమణ, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరులు ఉన్నారు.

బాలల సంఘాల ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: బాల్య వివాహాలు నిర్మూలన, బాలల రక్షణ కోసం గ్రామ స్థాయిలో ఏర్పాటు చేయనున్న బాలల సంఘాల ఏర్పాటులో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని జిల్లా బాలల రక్షణ న్యాయ పరిరక్షణ అధికారి తలే లక్ష్మణరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాలతో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

అభివృద్ధి పనులకు రూ. 3 లక్షల విరాళం

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవలో భాగంగా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులకు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పైడిశెట్టి దినేష్ మూడు లక్షల రూపాయలను విరాళంగా అందజేసినట్లు రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు తెలిపారు. సోంపేట రోటరీ క్లబ్ ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ రోటరీ ప్రతినిధులకు నగదు అందజేశారు.

10 నుంచి 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీలు

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆడుదాం-ఆంధ్రా' కార్యక్రమాన్ని ఈ నెల పదో తేదీ నుంచి మండల స్థాయిలో నిర్వహించనున్నట్టు ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వ్యాయామోపాధ్యాయులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

ఎస్సైగా అనిల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

మందస: మందస ఎస్సైగా బరుకు అనిల్‌కుమార్ శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం నుంచి బదిలీపై వచ్చిన ఆయన విధుల్లో చేరారు.

రోడ్డు పనులకు భూమి పూజ

కంచిలి: రోడ్ల నిర్మాణంతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. కొల్లూరు సచివాలయం పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4.5 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన 110 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేశారు.

మద్యం ఆరోగ్యానికి చేటు

కంచిలి: మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరమని కంచిలికి చెందిన ట్రూహ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.కృష్ణంరాజు అన్నారు. జలంత్రకోట పంచాయతీ పరిధి జె.మాణిక్యపురం గ్రామంలో మద్యపానం వినియోగం వలన చేకూరే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

రీ సర్వేలో తప్పిదాలు సరి చేస్తాం

సోంపేట: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీసర్వేలో తప్పులు ఉంటే సరి చేస్తామని తహసీల్దార్ సత్యన్నారాయణ అన్నారు. పలాసపురంలో రైతులతో మాట్లాడారు. సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యుడు రమణమూర్తి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని తహసీల్దార్ అన్నారు. లక్కవరంలో అన్నపూర్ణ రైస్ మిల్లును తనిఖీ చేసి సంబంధిత యజమానికి పలు సూచనలు చేశారు.